• ప్రమాదం అంచున విద్యుత్ స్తంభాలు

ఆదిలాబాద్‌లోని రాంనగర్ కాలనీ వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభం

మావలమ ండలంలో విద్యుత్ స్తంభాలకు తగులుతున్నచెట్టు కొమ్మలు

ఆదిలాబాద్‌లో ఆయా చోట్ల విద్యుత్ స్తంభాలుఒ రిగిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. మావలమ ండలంలో ఓ చోట విద్యుత్ తీగలు వేలాడడంతో కట్టెను స్తంభంలా ఏర్పాటు చేశారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలు ఎప్పుడు పడుతా యోనని ప్రజలు భయాందోళనకుగుర వుతున్నారు. విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలు తగిలి షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. విద్యుత్ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

-ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, డిసెంబర్ 20

• కిటకల కోసం వాలుతున్న కొంగలు

దుక్కిదున్నుతున్న ట్రాక్టర్ వెంట వాలిన కొంగలు

ఇంద్రవెల్లి మండలం కేస్లాగూడ(ఎం) గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ భూమిలో యాసంగి పంటలు సాగు చేసేందుకు ట్రాక్టర్‌తో దుక్కిదున్నడంతో కిటకలతో పాటు భూమిలో వెళ్లిన పురుగులను తినడానికి కొంగలు తరలివచ్చాయి. అంతేకాకుండా ఓ రైతు పంటకు సాగునీరు ఇస్తున్న సందర్భంగా కొంగలు తరలివచ్చి కిటకలను వెతికి తింటున్నాయి. దీంతో నల్లని భూమిలో వాలిన తెల్లని కొంగలు కనిపించడంతో రైతులు వాటిని చూసి మురిసిపోతున్నారు.

–ఇంద్రవెల్లి, డిసెంబర్ 20

పరీక్షలకు సన్నద్ధం కావాలి

- అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు

విద్యార్థులకుస్ట డీమె టీరియల్‌నుఅం దజేస్తున్నఅద నపుకలె క్టర్

ఎదులాపురం, డిసెంబర్ 20 : సమయాన్ని వృథా చేయకుండా పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఎస్సీ, బీసీ వసతి గృహాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులకు ఏదైనా సబ్జెక్టులలో అనుమానాలు ఉంటే వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్సీడీవో భగత్ సునీతా కుమారి, డీబీసీడీవో రాజలింగు, ఏఎస్‌డబ్ల్యూవోలు నారాయణ రెడ్డి, సునీత, వసతి గృహ సంక్షేమ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం

మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రుక్మాణ్‌సింగ్

బోథ్, డిసెంబర్ 20 : బోథ్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం బుధవారం చైర్మన్ ఎస్ రుక్మాణ్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించారు. పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కోదాడ మార్కెట్ కమిటీకి రూ.5 కోట్లు అప్పుగా ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. మార్కెట్ కమిటీలో అందుబాటులో ఉన్న నిధులతో గోదాంలు నిర్మిస్తే రైతులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, కార్యదర్శి దేవన్న, ఏఎంఎస్ స్వామి, సర్పంచ్ సురేందర్‌యాదవ్, ప్రశాంత్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

4.61 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు

మాట్లాడుతున్న జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్

బోథ్, డిసెంబర్ 20 : ఆదిలాబాద్ జిల్లాలో 4.61 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం బోథ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని క్వింటాల్‌కు రూ.7020 మద్దతు ధర చెల్లిస్తూ కొనుగోలు చేయిస్తున్నామన్నారు. సీసీఐ ద్వారా 1.69 లక్షల క్వింటాళ్లు, ప్రైవేట్ వ్యాపారులు 2.92 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. సుమారు 13,348 మంది రైతులు తమ పత్తిని కేంద్రాల్లో అమ్ముకున్నట్లు చెప్పారు. పత్తిని అమ్మకానికి తీసుకువచ్చే రైతులు తమ బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింకు ఉందో..లేదో ముందుగానే తెలుసుకోవాలన్నారు. సమీప బ్యాంకులకు వెళ్లి క్రాస్‌చెక్ చేయించుకోవాలన్నారు. లేని పక్షంలో ఆధార్ లింకు చేయించుకోవాలన్నారు. అకౌంట్‌కు ఆధార్ లింకు లేకపోతే డబ్బులు వేయడంలో ఆలస్యమవుతుందన్నారు. సీసీఐ కేంద్రాల ద్వారా నిరంతరం పత్తి కొనుగోళ్లు ఉంటాయని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవన్న, బోథ్ సీసీఐ కేంద్రం సీపీవో రాజీవ్ బిసోయి, వ్యాపారులు కత్తూరి విశ్వానంద్, కత్తూరి మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం

- వినాయక్‌చౌక్‌ను కూల్చి వేయండి అనడం సరికాదు
- మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజానీ

మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ

ఎదులాపురం, డిసెంబర్ 20 : పట్టణ సుందరీకరణలో భాగంగా పలు చౌక్‌లను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అని ఇందుకు ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ఎంతో కష్టపడ్డారని మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక్ చౌక్‌ను కూల్చివేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. పట్టణంలో జరిగిన అభివృద్ధిని అడ్డుకోవాలనుకుంటే వాటికి పెట్టిన ఖర్చులు ప్రభుత్వానికి అందజేసి కూల్చివేయాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, కౌన్సిలర్లు రాజు, సందనర్సింగ్, భూమన్న, భరత్‌కుమార్, అశోక్ స్వామి, నాయకులు రాము, సృజన్ రెడ్డి, సాయిప్రణయ్, లక్ష్మణ్, రామేశ్వర్, ఇమ్రాన్, లస్మన్న పాల్గొన్నారు.

శనగలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

రైతులకుసూ చనలుఇ స్తున్న ఏఈవో శ్యాంసుందర్‌రెడ్డి

బోథ్, డిసెంబర్ 20 : శనగ పంటలో అవసరమైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఈవో శ్యాంసుందర్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని మర్లపెల్లి క్లస్టర్ పరిధిలోని శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ శనగలో అక్కడక్కడ ఎండు తెగులు కనిపిస్తున్నందున రైతులు అలర్ట్ అనే మందును పిచికారీ చేసుకోవాలని సేచించారు. శనగలో పచ్చ పురుగు నివారణకు బెంజర్ అనే మందును పిచికారీ చేసుకుంటే ఫలితం ఉంటుందన్నారు.

డిగ్రీ పరీక్షలో 27 మంది డిబార్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 20 : కేయూ పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ–1, 5వ సెమిస్టర్ పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 27 మంది డిబార్ అయినట్లు కేయూ అధికారులు తెలిపారు. ఇచ్చోడ ఛత్రపతి డిగ్రీ కళాశాలలో 16 మంది, ఇచ్చోడ సాయి సమత్ డిగ్రీ కళాశాలలో నలుగురు, ఇచ్చోడ కాకతీయ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, బెల్లంపల్లి భవిత డిగ్రీ కళాశాలలో ఇద్దరు, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

తాంసి, డిసెంబర్ 20: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఎంఈవో శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. మండల బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు పిల్లలకు హక్కులను వివరించారు. బాలబాలికలకు స్పోర్ట్స్ మెటీరియల్, ఎడ్యుకేషన్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సౌజన్య, పోలీస్ అధికారి రమేశ్, కేజీబీవీ ఎస్‌వో సౌజన్య, మహిత స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఇమ్రాన్, ప్రతినిధులు వర్ష పాల్గొన్నారు.

పేర్లను పరిశీలించుకోవాలి

ఎదులాపురం, డిసెంబర్ 20 : ఐఆర్‌సీఎస్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి పంపించిన ఓటరు, మెంబర్‌లిస్టులో సభ్యులు పేర్లను పరిశీలించుకోవాలని జిల్లా సహకార అధికారి బీ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చిన లిస్టును జిల్లా ఐఆర్‌సీఎస్ కార్యాలయ నోటీస్ బోర్డుపై అతికించడం జరిగిందన్నారు. ఈ ఓటరు, మెంబర్ లిస్టు ఆధారంగా ఆదిలాబాద్ బ్రాంచ్ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అట్టి లిస్టులో పేర్లు ఉన్నాయ లేవా, లేనిచో సంబంధిత ఆధారాలతో ఐఆర్‌సీఎస్, జిల్లా సహకార అధికారిని సంప్రదించాలనిసూ చించారు.

న్యుమోనియా నివారణకు చర్యలు

నార్నూర్, డిసెంబర్ 20 : న్యుమోనియా నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. బుధవారం మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో న్యుమోనియా నివారణకు సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు ఈశ్వర్, ఆశకార్యకర్త గుంపాబాయి, అంగన్‌వాడీ టీచర్ ఆత్రంక మలబాయి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నిర్మల్ టౌన్, డిసెంబర్ 20 : షెడ్యూల్ కులాల అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్, డిగ్రీ, సాధారణ వృత్తి నైపుణ్యత కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారి రాజేశ్వర్ గౌడ్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గానూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు కళాశాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణపత్రాలతో ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలనికో రారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పొచ్చెరలోఅభి వృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, డిసెంబర్ 20 : పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం పొచ్చెర గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీ రాజమణి, మహిపాల్, దివాకర్‌రెడ్డి, రాజారెడ్డి, రాజేశ్వర్, శ్రీధర్‌రెడ్డి, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్వయం ఉపాధిపై శిక్షణ

మాట్లాడుతున్న ఏనబుల్ ఇండియా సంస్థ ప్రతినిధి మల్లికార్జున్

ఎదులాపురం, డిసెంబర్ 20 : దివ్యాంగులు స్వయం ఉపాధిపై ఇచ్చిన శిక్షణతో ఆర్థికంగా ఎదగవచ్చని ఏనబుల్ ఇండియా సంస్థ ప్రతినిధి మల్లికార్జున్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని ఐకేపీ భవనంలో దివ్యాంగులకు స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన 35 మందిని ఎంపిక చేసి పది రోజుల పాటు వ్యాపార అభివృద్ధి నైపుణ్యతపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, దివ్యాంగుల శాఖ ఏఆర్‌వో పోశెట్టి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బావునే నగేశ్, దివ్యాంగుల ఆత్మీయ సమితి అధ్యక్షుడు చిందవార్ రాకేశ్, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

అయ్యప్ప స్వామికి అభిషేకం చేస్తున్న నారికేళగురు స్వాములు

తాంసి, డిసెంబర్ 20 : మండల కేంద్రంలోని కళాశాల ప్రాంగణంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం రాత్రి మహ పడిపూజను వైభవంగా నిర్వహించారు. నిర్వాహకులు 18 నారికేళ గురుస్వామి సోమ నరేశ్ రెడ్డి ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. కేరళ హరిహర క్షేత్రంలోని అయ్యప్ప స్వామి ప్రధాన అర్చకుడు శివానంద తంత్రి హాజరై భక్తి ప్రవచనాలు బోధించారు. అగ్నిగుండ ప్రవేశం చేసి వేడినూనెలో వేసిన బజ్జీలను అయ్యప్ప స్వాములు తీసి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో గురుస్వాములు సర్పంచ్ స్వప్న–రత్న ప్రకాశ్, నరేశ్, సంతోష్ రావ్, సూర్యకాంత్, సతీశ్, శ్రీనివాస్‌రావ్, దేవారెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు శ్రీసంత్ గాడ్గే బాబా మహారాజ్

జైనథ్(బేల), డిసెంబర్ 20: ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించే విధంగా పాటుపడిన మహాత్ముడు, ఆదర్శప్రాయుడు శ్రీ సంత్ గాడ్గే బాబా మహరాజ్ అని ఆడనేశ్వర ఫౌండేషన్ చైర్మన్ సతీష్ పవార్ అన్నారు. శ్రీ గాడ్గే బాబా మహారాజ్ వర్ధంతిని పురస్కరించుకొని బేలలోని గాడ్గే బాబా మహారాజ్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ రజక సంఘం నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రశేఖర్, రజక సంఘం మండలాధ్యక్షుడు ప్రకాశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, మాజీ సర్పంచ్ తేజ్‌రావ్, మాజీ వైస్‌ఎంపీపీ సంజయ్ నిపుంగే, రజక సంఘం మండల నాయకులు, కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 20 : శ్రీసంత్ గాడ్గే బాబా మహారాజ్ 67వ వర్ధంతిని జిల్లా రజక సంఘం అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆదిలాబాద్‌లోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ సంత్ గాడ్గే బాబా మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. రజకుల కోసం అనేక సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రాజేశ్వర్, శ్రీను, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 20 : ఈ నెల 25వ తేదీన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఆదిలాబాద్‌లోని హోలీ ఫ్యామిలీ క్యాథలిక్ చర్చి ఫాదర్ అజ్జు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న రాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. చర్చి ఆవరణలో క్రిస్మస్ క్రిబ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చింతల్‌బోరిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభాష్ చందర్

బోథ్, డిసెంబర్ 20 : పార్లమెంట్ ఎన్నికల కోసం మండలంలోని వజ్జర్, చింతల్‌బోరి, పార్డి(కే), సోనాల, కోట(కే) గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ సుభాష్ చందర్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ సునీత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రైతుబంధు కోసం ఎదురుచూస్తున్న రైతులు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 20 : ఆదిలాబాద్ జిల్లాలోని రైతులకు నేటికి కూడా రైతుబంధు డబ్బులు వారి ఖాతాలో జమకానటువంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. రైతులు వానకాలంలో సాగు చేసిన పంటలకు జూలై, ఆగస్టులో కురిసిన వర్షాలతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. యాసంగి పంటలు సాగు చేసేందుకు రైతుల వద్ద డబ్బులు లేకపోవడంతో పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి వడ్డీతో డబ్బులు అప్పులుగా తీసుకుంటున్నారన్నారు. రైతులకు వెంటనే రైతుబంధు డబ్బులు వారి ఖాతాలో వేసి ఆర్థికంగా భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు చిరంజీవి, మెస్రం గోదిరావ్, రాంనివాస్, జైరాం, హరినాం, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు నివాళి

భీంపూర్, డిసెంబర్ 20 : భీంపూర్ తహసీల్ కార్యాలయ ఆవరణలో బుధవారం తహసీల్దార్ నారాయణ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆయన అకాలమృతి విచారకరమని డీటీ హరీశ్ అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు అశోక్, శారద, తహసీల్, మండల పరిషత్ సిబ్బంది, సర్పంచ్ మడావి లింబాజీ, ఉపసర్పంచ్ జాదవ్ రవీందర్, బీఆర్‌ఎస్ నాయకులు ధరమ్‌సింగ్, రాథోడ్ ఉత్తమ్, కార్యదర్శులు, రైతులు, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ చిత్రపటం వద్దని వాళులర్పిస్తున్నఅధి కారులు, ప్రజాప్రతినిధులు

పఠనాసక్తి పెంపొందించడానికి గ్రంథాలయాలు

మాట్లాడుతున్న రాష్ట్ర రిసోర్స్ పర్సన్ పసుల ప్రతాప్

జైనథ్, డిసెంబర్ 20 : విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి గ్రంథాలయాలు దోహదం చేస్తాయని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ పసుల ప్రతాప్ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎన్‌ఆర్‌ఐవీఏ (నివ)– పుస్తక మిత్ర అందించిన గ్రంథాలయ పుస్తకాల పుస్తక ప్రదర్శనకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం ద్వారా భాషా నైపుణ్యాలు, సామర్థ్యాలు, ప్రాపంచిక జ్ఞానం పెరుగుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ మాట్లాడుతూ నివా– పుస్తక మిత్ర సంస్థ ద్వారా పాఠశాలకు రూ.40 వేల విలువ గల పుస్తకాలు 1500 మంది విద్యార్థులకు అందించారని తెలిపారు. పాఠశాలలో లైబ్రరీ పీరియడ్‌లో వీటిని చదివించడంతో పాటు పిల్లల ఇంటి వద్దకు కూడా పుస్తకాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పుస్తక ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి లక్ష్మీరాములు, ఎంపీటీసీ జయమాల– మనోజ్, ఉపసర్పంచ్ గాజంగుల స్వామి, పాఠశాల కమిటీ చైర్మన్ హెడావ్ అశోక్, సీపీడీ సభ్యులు అజయ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్, ఉపాధ్యాయులు హనుమంత్‌రావ్, రహీమ్, నారాయణ, గణేశ్, మమత పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న గిరిజన క్రీడల అభివృద్ధిఅధి కారి పార్థసారథి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 20 : చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని తద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. వివిధ విభాగాల్లో క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి పీ రాజేశ్, జిల్లా పాఠశాల క్రీడ సమాఖ్య కార్య నిర్వాహక కార్యదర్శి కాంతారావ్, వ్యాయామ ఉపాధ్యాయులు రాకేశ్, మజీద్, సౌమ్య పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

మాట్లాడుతున్న కృష్ణవేణి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 20 : ఆడపిల్లలను పర్యవేక్షిస్తూ వారి రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి సూచించారు. బుధవారం ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై వివక్షత చూపవద్దన్నారు. ప్రభుత్వాల ద్వారా కల్పించిన హక్కులు, చట్టాలపై మహిళలకు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలను రక్షిద్దాం..బాలికలను చదివిద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ శోభ, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.